నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక
RNI No. TGTEL/25/A3190

# కేసులు నమోదైనా.. రేషన్ బియ్యం దందా ఆగేదెప్పుడు?

## మూడు నెలల రేషన్ ఒకేసారి.. అక్రమార్కులకు వరంగా మారిందా?




**గజ్వేల్/సిద్దిపేట, నేటి దిక్సూచి :** పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం సిద్దిపేట జిల్లాలో అక్రమ వ్యాపారానికి తరలిపోతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం సేకరించి ఇతర ప్రాంతాలు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కొందరు మిల్లర్ల పాత్ర ఉందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో దళారులకు మరింత అవకాశం లభించిందని స్థానికులు అంటున్నారు. పెద్ద మొత్తంలో బియ్యం అందుబాటులోకి రావడంతో లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని కొనుగోళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సంబంధిత శాఖల్లోని కొందరు సిబ్బందికి మామూళ్లు చెల్లిస్తూ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**పీడీ యాక్ట్ కేసు నమోదైనా..**

రాయపోల్ మండలం రామారం గ్రామంలోని శ్రీ సాయి మహాదేవ రైస్ మిల్లుకు సంబంధించిన రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో గత మే నెలలో రత్నాకర్ అనే వ్యక్తిపై పీడీ యాక్ట్ కేసు నమోదైంది. అయినప్పటికీ అదే ప్రాంతంలో అక్రమ కొనుగోళ్లు, రవాణా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు రావడం అధికారుల నిఘాపై అనుమానాలు కలిగిస్తోంది.

రేషన్ బియ్యం ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? మిల్లుల పాత్ర ఎంత? అక్రమ దందాకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మిల్లులు, గోదాములు, రేషన్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




**రేపటి సంచికలో మరిన్ని వివరాలు..**

*రేషన్ బియ్యం దందా వెనుక అసలు సూత్రధారులు ఎవరు? బియ్యం ఎక్కడి నుంచి వస్తోంది.. ఎక్కడికి తరలుతోంది? మిల్లుల పాత్ర ఏమిటి? పీడీ యాక్ట్ కేసు నమోదైనా అక్రమ వ్యాపారం ఎందుకు ఆగడం లేదు? వంటి కీలక అంశాలపై రేపటి సంచికలో ప్రత్యేక కథనం.*